కథ

# మార్పు

'చెప్పండి డాక్టర్ నా భార్యకు మామూలు జ్వరమేనా? పోనీ బ్లడ్, యూరిన్ టెస్టు చేస్తే బాగుండేదేమో! మంచి మందులు రాసివ్వండి. ఎంత ఖరీదైనా ఫరవాలేదు'' అన్నాడతను.

"ఏ టెస్టూ అవసరం లేదు. మీ ఆవిడకి వచ్చింది మామూలు జ్వరమే. ఈ మందులు వాడండి తగ్గిపోతుంది" ప్రిస్కిప్షను రాస్తూ అన్నది డాక్టర్ మంజుల.

"మామూలు పారాసెటమాల్‌తో తగ్గిపోతుందంటారా" ప్రిస్కిప్షను చదివి అన్నాడతను.

మంజులకి కోపం వచ్చింది. "ఏ జబ్బుకి ఏ మందులివ్వాలో నాకు తెలుసు. అవసరం లేకపోయినా అన్ని పరీక్షలూ చేసి ఓ నాలుగు రకాల మందులు రాస్తేకానీ మీలాటివారికి తృప్తి వుండదు" కోపంగా అన్నది.

అతడు మాట్లాడలేదు. మౌనంగా డాక్టర్ ఫీజు పే చేసి భార్యతో కలిసి వెళ్ళిపోయాడు.

'వెనకటి కాలంలో జలుబు చేస్తే మిరియాల కషాయం తాగేవాళ్ళు. ఇప్పుడు ఎవరికైనా అలాటి సలహా ఇస్తే నవ్వుతారు. తుమ్మినా, దగ్గినా డాక్టరు దగ్గరకి పరిగెత్తుకు రావడం ఫ్యాషన్ అయిపోయింది ఈరోజుల్లో' కుర్చీలో వెనక్కి వాలుతూ అనుకుంది డాక్టర్ మంజుల.

"మేడమ్ ఇంకొకళ్ళున్నారు పంపించమంటారా?" గుమ్మంలోకి తొంగిచూస్తూ అన్నది సిస్టర్.

తలూపింది మంజుల.

ఆకుపచ్చ కర్టెన్ తొలగించుకుంటూ అడుగులో అడుగేస్తూ వచ్చింది ఆమె. తెల్లగా సన్నగా వుంది. మెళ్ళో నల్లపూసలూ, కాళ్ళకి మెట్టెలు ఆమె వివాహిత అని చెప్తున్నాయి.

"నమస్తే డాక్టర్" లోపలికొస్తూనే అన్నది ఆమె.

"కూర్చోండి" పక్కనే వున్న స్టూలు చూపిస్తూ అన్నది మంజుల.

"నా పేరు సుజాత. మీరు అనుమతిస్తే మీతో నా సమస్య చెప్పుకోవాలని వచ్చాను" స్టూలుమీద కూర్చుంటూ అన్నదా యువతి.

"మీ మంచితనం గురించి చాలా విన్నాను డాక్టర్. పవిత్రమైన వైద్య వృత్తిని వ్యాపార దృష్టితో కాక సేవాభావంతో చూసే అపురూపమైన వ్యక్తి మీరు. బీదవారి దగ్గర ఫీజు తీసుకోరనీ, ఎక్కువ మెడిసిన్స్ రాసి అనవసర ఆర్భాటాలు చెయ్యరనీ, మా ఇరుగూ పొరుగూ చెప్తే విని నా సమస్య మీకు చెప్పుకోవాలని వచ్చాను"

మంజుల ఆసక్తిగా ఆమె వంక చూస్తోంది, నిండా పాతికేళ్ళు లేని ఈమెకి ఇంత బాధపెట్టే సమస్య ఏమిటా అని.

ఆమె నెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టింది.

"మాది ఒక మధ్యతరగతి కుటుంబం. నాకు పెళ్ళయి రెండేళ్ళు అయింది. ప్రస్తుతం నేను మూడు నెలల గర్భవతిని. కానీ జీవితంలో తొలిసారిగా తల్లిని కాబోతున్నానన్న సంతోషం నాకు నిలిచేటట్టు లేదు డాక్టర్. నేను మగబిడ్డనే కనాలని మా అత్తగారు ఆంక్ష పెట్టింది. అందుకే రేపు మీ దగ్గర పరీక్ష చేయించి ఒక వేళ నా కడుపులో పెరిగేది ఆడపిల్లయితే అబార్షను చేయించుకోమంటోంది ఆవిడ"

"చూడమ్మా సుజాతా! ఇది మొదటి ప్రెగ్నెన్సీ కాబట్టి అబార్షను చేయించుకోవడం మంచిది కాదు. రేపు మీ అత్తగారికి అలా నచ్చచెప్తాలే, భయపడకు" జాలిగా అంది డాక్టర్ మంజుల.

"వాళ్ళకి నా ఆరోగ్యంతో పనిలేదు. మీరెన్ని చెప్పినా నా కడుపులో పెరిగేది ఆడపిల్ల అని తెలీగానే వాళ్ళు నాకు అబార్షను చేయిస్తారు. మీరు చేయడానికి ఒప్పుకోకపోతే ఇంకోచోట చేయిస్తారు అందుకని..." చెప్పడానికి తటపటాయిస్తున్నట్టుగా ఆగిపోయింది సుజాత.

"ఊ... అందుకని నన్నేం చేయమంటావు?" కుతూహలంగా అంది మంజుల.

"మీరు నన్ను పరీక్ష చేసాక నా కడుపులో పెరిగేది ఆడపిల్ల అయినా మగబిడ్డే అని చెప్పండి ప్లీజ్" దీనంగా అందీ సుజాత.

"కానీ, ఓ డాక్టరుగా నేను అలాంటి తప్పుడు రిపోర్టు ఇవ్వకూడదు. నీకోసం నేను అలా చెప్పినా నువ్వు తొమ్మిది నెలలూ మోసి బిడ్డను కన్న తరువాతైనా వాళ్ళకి నిజం తెలుస్తుంది కదా!"

"పసిదాని ముఖం చూసైనా వాళ్ళు నన్ను క్షమిస్తారేమో అనుకుంటున్నాను. అంతకన్నా ముందు నా బిడ్డని దక్కించుకున్నానన్న తృప్తీ నాకు మిగులుతుంది"

"చూడు సుజాతా! నీకు ఇష్టం లేకుండా బలవంతంగా అబార్షను చేసే హక్కు ఏ డాక్టరుకీ లేదు"

"కానీ నేను ఎక్కువగా చదువుకోలేదు డాక్టర్. అన్ని విషయాలలో నా భర్త అత్తగార్ల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే నాకు నా ఇష్టాఇష్టాలని వాళ్ళతో చెప్పే ధైర్యం లేదు"

"నీవేకాదు నీలాటి వాళ్ళు చాలామంది వున్నారు. మౌనంగా హింసని భరిస్తూ స్వతంత్రంగా బతికే దారి లేక భారంగా బ్రతుకులీడిస్తున్న వాళ్ళు ఎంత మందో! రేపు మీ అత్తగార్ని తీసుకురా ఆవిడకి ఎలా నచ్చచెప్పాలో నేను చూసుకుంటాను" సాలోచనగా అంది మంజుల.

సుజాత తలూపి వెళ్ళిపోయింది.

డాక్టర్ మంజుల గతమంతా కళ్ళముందు మెదిలింది.

★★★

"అమ్మా మంజూ! నేనలా రావుగారింటికి వెళ్తాను. వాళ్ళ అమ్మాయిని కాపురానికి పంపిస్తున్నారుట. అరిసెలూ, లడ్డూలు చేయడానికి రమ్మంది రావుగారి భార్య. తలుపేసుకో తల్లీ" జానకమ్మ అంది.

పధ్నాలుగేళ్ళ మంజుల తలూపింది. తలుపు గడియ పెట్టి మర్నాటి నుండి జరిగే పరీక్షలకి చదువుకోవడం మొదలుపెట్టింది.

జానకమ్మకి చిన్నతనంలోనే భర్తపోయాడు. భర్త మిగిల్చిన రెండు గదుల పెంకుటిల్లూ, కొద్ది సామానూ తప్ప ఏ ఆస్తీ లేదామెకు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు కాబట్టి ఇంటికొచ్చే బంధుజనాలు కూడా లేని ఏకాకి. అటువంటి జానకమ్మకి గోదావరి పుష్కరాలలో దొరికింది భార్గవి. అంతవరకూ నిస్తేజంగా గడిపిన జీవితానికి ఏదో పరమార్థం దొరికినట్లైంది జానకమ్మకి. అప్పట్నించి భార్గవిని మంజుల పేరుతో పిలుచుకొని ఆమెతోటే లోకంగా బతుకుతోంది జానకమ్మ. మంజులని చదివించడానికి జానకమ్మ పడని కష్టం లేదు. మిషను కుట్టి సంపాదించేది. ఎవరైనా వంట సాయానికి పిలిస్తే వెళ్ళేది. ఒక పనికి పిలిచి నాలుగు పనులు చెప్పినా నోరెత్తకుండా చేసేది. నలుగురికీ మంచి మనిషిగా పేరు తెచ్చుకుంది.

పదో తరగతిలో స్కూలు ఫస్టు వచ్చింది మంజుల. జానకమ్మ ఆనందానికి అంతులేదు.


"అమ్మా ఇక నుండి నేను కూడా మిషను నేర్చుకుని బట్టలు కుట్టి సంపాదిస్తా. నీవు చేసే పనుల్లో నీకు చేదోడువాదోడుగా ఉంటా" అంది మంజుల.

వినకూడని మాటేదో విన్నట్టు కలవరపడింది జానకమ్మ.

"పిచ్చిపిల్లా! లక్ష్మీకటాక్షం కన్నా సరస్వతీ కటాక్షం కలగడం కష్టం. ఆ చదువుల తల్లి అనుగ్రహం వుంది నీమీద. అందుకే నా రెక్కల కష్టంతో చదివించుకుంటా నిన్ను. ఇక ఇంటి పరిస్థితి గురించి ఆలోచించకు. సంకల్పబలం వుండాలేకానీ మనిషి సాధించలేనిది ఏదీ లేదు"

మంజులని దగ్గరకి తీసుకుంటూ అన్నది జానకమ్మ.

జానకమ్మ ఆత్మీయతకి మంజులకి కన్నీరాగలేదు. ఆమెకు తన చిన్నతనం లీలగా గుర్తుంది. తనకప్పుడు



ఎనిమిదేళ్ళు వుంటాయేమో. రోజూ గిన్నెలు తోమడం, ఇళ్ళు వూడ్చడం తన చేతే చేయించేది తన తల్లి. తను ఆడపిల్ల కాబట్టి ఆ పనులన్నీ చిన్నప్పటి నుంచీ తనకి అలవాటు చేసింది అమ్మ. తనెప్పుడైనా అన్నయ్యలాగా గంతులేసి ఆడినా అమ్మ కోప్పడేది. కాళ్లూ, చేతులూ సరిగా ఉంచుకోకపోతే ఆనక పెళ్ళి అవడం కష్టంట తనకి. భగవంతుడా నన్ను కూడా అన్నయ్యలాగే మగాడిగా ఎందుకు పుట్టించలేదు అని తన చిన్ని మనసులో దేవుడిని ప్రశ్నించుకునేది ఆనాటి భార్గవి.

అటువంటి భార్గవి ఓసారి గోదావరి పుష్కరాల్లో తల్లిదండ్రుల నుండి తప్పిపోయి దేవతలాంటి జానకమ్మకి దొరికింది. అలా జరగడం ఒక రకంగా మంజుల అదృష్టమేమో!

జానకమ్మ ప్రోద్బలం మీద ఇంటర్‌లో చేరింది మంజుల. రంగు రంగుల సీతాకోక చిలుకల్లా తయారై కాలేజీకొచ్చే ఆడపిల్లల్లో రంగు వెలిసిన ఓ రెండు జతల బట్టలతోటే ఇంటర్ గడిపేసింది మంజుల. తన లేమితనానికి ఏమాత్రం బాధపడకుండా క్లాసులో ఎప్పుడూ ఫస్టుర్యాంక్ స్టూడెంట్‌గానే పేరు తెచ్చుకుంది.

ఇంటర్ పూర్తవగానే ఎంసెట్ రాసి ఎం.బి.బి.ఎస్.లో ర్యాంక్ తెచ్చుకుంది మంజుల.

'నా బంగారుతల్లి డాక్టరౌతుంది' అంటూ ఇరుగూ పొరుగూ వాళ్ళతో చెప్పి మురిసిపోయింది జానకమ్మ.

ఒక పూట తినీ ఒక పూట తినకా కూడబెట్టి మంజులకి డబ్బు పంపించేది జానకమ్మ. శక్తికి మించి కష్టపడడం వల్ల సరైన తిండి తినకపోవడం వల్ల జానకమ్మ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. కానీ మంజుల చదువు ఆగిపోతుందేమోనని ఈ విషయాలేవీ మంజులకి తెలియనిచ్చేది కాదు. మంజుల డాక్టరై తిరిగి వచ్చేసరికి టి.బి. వ్యాధి ముదిరిపోయి జీవితపు చివరి ఘడియలలోకి చేరుకుంది జానకమ్మ. శరీరం కట్టెలా మారబోయే క్షణంలో మంజులని దగ్గరికి పిలిచి హీన స్వరంతో అంది జానకమ్మ, "అమ్మా మంజూ! నా స్వార్థం కోసం నిన్ను నీ కన్న తల్లి నుండి దూరం చేశానమ్మా. నన్ను క్షమించవూ"

మంజులకేమీ అర్థం కాలేదు.

మళ్ళీ జానకమ్మే అంది "నీకీ విషయం చెప్పకూడదనే అనుకున్నాను కానీ నేను పోయే ముందైనా నేను చేసిన తప్పు నీతో చెప్పకపోతే నా ఆత్మకు శాంతి వుండదు.

నువ్వు నాకు దొరికిన కొత్తల్లో మీ ఊరి పేరూ, మీ ఇంటి అడ్రెస్సూ చెప్పి నన్ను మీ యింటికి చేర్చమనే దానివి గుర్తుందా. కానీ, నేను ఎప్పటికప్పుడు ఏదో ఒకటి చెప్పి తప్పించుకునే దాన్ని. చివరికి నీ బాధపడలేక మీ అమ్మావాళ్ళు వేరే ఊరు వెళ్ళిపోయారనీ మీ నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయిందనీ అబద్ధం చెప్పేదాన్ని. ఎందుకో నిన్ను దూరం చేసుకోవడం ఇష్టంలేక అలా చేశానేకానీ నీ కన్నవాళ్ళకి కడుపుకోత మిగుల్చుతున్నానని తెలుసుకోలేకపోయాను.

నన్ను క్షమించు తల్లీ"

మంజుల ఓ క్షణం తెల్లబోయింది.

అయినా స్వంత తల్లి దగ్గరున్నా తను ఇంతకన్నా సుఖంగా బతికేదా? పెంచిన తల్లైనా అమ్మకన్నా అపురూపంగా చూసుకుంది తనని.

"మంజూ! నా తల్లీ, ఒక్కమాట... క్షమించానని..." జానకమ్మ తనలో తనే గొణుక్కుంటోంది.

"ఇప్పుడవన్నీ ఎందుకమ్మా" మంజుల మాట వినిపించుకోకుండానే కన్ను మూసింది జానకమ్మ.

జానకమ్మని ఎరిగున్న వారంతా తమ స్వంత మనిషి పోయినట్టే బాధపడ్డారు. అందరూ తలో చేయి

ఆదుర్తి బాల

వేసి జానకమ్మకి అంత్యక్రియలు జరిపించారు.

కొన్నాళ్ళు ఓ ప్రైవేటు హాస్పటల్‌లో పనిచేసిన తర్వాత స్వంతంగా నర్సింగ్‌హోమ్ కట్టించి ప్రాక్టీసు మొదలుపెట్టింది మంజుల.

★★★

గత స్మృతులతో గుండె బరువెక్కింది మంజులకి.

"నమస్తే డాక్టర్"

తలెత్తిచూసింది మంజుల.

సుజాత వచ్చింది అత్తగార్ని తీసుకొని.

"ఈవిడే మా అత్తగారు" మంజులకి పరిచయం చేస్తూ అన్నది సుజాత.

ఆవిడ వంక చూసిన మంజులకి ఆనందమో, ఆశ్చర్యమో ఒక్కసారిగా కలబోసినట్టు నోట మాట రాలేదు. ఆవిడ... తన తల్లి కృష్ణవేణమ్మ. అంటే సుజాత తన అన్న భార్య. తన వదిన అన్నమాట. తనకి తల్లి రూపం బాగా గుర్తుంది. అప్పటికీ ఇప్పటికీ ఎక్కువ తేడాలేదు అమ్మలో. కానీ ఆవిడేంటి తనని గుర్తుపట్టలేదా?

"మా కోడలికి పరీక్ష చేసి పుట్టబోయేది ఆడబిడ్డో, మగబిడ్డో చెప్పండి డాక్టర్"

మంజుల ఆలోచనలు చెదరగొడుతూ అన్నది కృష్ణవేణమ్మ.

పదిహేనేళ్ళ క్రితం విన్న కంఠస్వరం.... ఏం మారలేదు.

"ఒకవేళ ఆడపిల్ల అయితే అబార్షన్ చేసేయండి" మళ్ళీ కృష్ణవేణమ్మే అంది.

మంజుల వంక భయంగా చూసింది సుజాత.

అయితే అమ్మ మనస్తత్వం ఏమాత్రం మారలేదన్నమాట. మనసులోనే అనుకుంది మంజుల.

"ఆడపిల్లయితే పెంచడానికి ఏమిటి అభ్యంతరం?" తల్లినే చూస్తూ అంది మంజుల.

"ఆ... ఏం సుఖంలే తల్లీ ఆడపిల్లతో. అన్నీ ఖర్చులే. వెనకటి కాలంలో ఆడపిల్లంటే కాస్త పనిపాటలు నేర్చుకుని కొద్దో గొప్పో కట్నాలిస్తే పెళ్ళయిపోయేది. ఇప్పుడలా కాదు. అందరూ చదువుకున్న పిల్ల కావాలంటున్నారు. కట్నం ఖర్చుతోపాటు చదువు ఖర్చులు కూడా ఏం భరిస్తాం?"

"అయినా ఈరోజుల్లో చదువుకున్న ఆడపిల్లలెవరూ ఖాళీగా కూర్చోవటం లేదు. మగవాళ్ళతో సమానంగా ఆడవారికి కూడా అన్ని రంగాల్లో అవకాశాలున్నాయి. డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, పైలట్లుగా కూడా రాణిస్తూ తమ సమర్థతని చాటుకుంటున్నా ఆడపిల్ల అనగానే ఎందుకింత నిరసన చూపుతారో అర్థంకాదు" అన్నది మంజుల.

"మీరు చెప్పింది ఏ కొద్దిమంది ఆడవారి గురించో కానీ పుట్టిన ప్రతి ఆడపిల్లా పెద్ద చదువులు చదవగలుగుతోందా? సగటు ఆడదాని జీవిత గురించి ఆలోచిస్తే తెలుస్తుంది. కట్నాల్లేకుండా ఎందరు ఆడపిల్లలకి పెళ్ళిళ్ళవుతున్నాయి? పోనీ కష్టపడి కోనేసన్ను కట్టి ఆడపిల్లని చదివించినా అది ఉద్యోగస్థురాలైన తరువాత ఆ సంపాదనంతా భర్త చేతుల్లో పోస్తుంది కానీ, తల్లిదండ్రులకిస్తుందా? అప్పుడు కూడా నష్టపోయేది తల్లిదండ్రులే"

"చూడండి ఆడపిల్లయినా, మగపిల్లాడయినా పిల్లలు ప్రయోజకులవ్వాలని తల్లిదండ్రులు కోరుకోవాలి కానీ వాళ్ళు సంపాదించిందంతా తన చేతుల్లో పోయాలని అనుకోకూడదు. ఇంకొక మాట, ఎంతమంది మగపిల్లలు తల్లిదండ్రుల్ని బాధ్యతగా పట్టించుకుంటున్నారు?"

"పోనీలెండి డాక్టర్! ఎవరి ఇష్టం వారిది. మాకు మాత్రం మనవరాలు అక్కర్లేదు. మా అబ్బాయి కూడా అదే అన్నాడు"

ఆవిడ మనస్తత్వం తెలుసు గనుక తను ఆవిడని కన్విన్స్ చేయలేదని మంజులకి తెలుసు. ఇక అసలు విషయంలోకి వస్తూ అన్నది మంజుల. "చూడండమ్మా మీ పేరు కృష్ణవేణమ్మగారు కదూ?"

"అవును. మీకెలా తెలుసు?" కొద్దిగా ఆశ్చర్యంగా అన్నది కృష్ణవేణమ్మ.

"నాకెలా తెలుసో తర్వాత చెప్తాకానీ మీకు భార్గవి అనే కూతురుండేది. ఔనా?"

కృష్ణవేణమ్మ ముఖంలో బాధ తొంగిచూసింది.

"ఔనమ్మా... ఉండేది.." కళ్లు తుడుచుకుంటూ అన్నది కృష్ణవేణమ్మ.

"ఉండేది అంటున్నారు. అంటే ఇపుడు లేదా.. చచ్చిపోయిందా.."

"వద్దు.. ఒద్దమ్మా.. అలా అనకు. ఎపుడో పన్నెండేళ్ళ వయసులో తప్పిపోయింది" మంజుల మాట పూర్తికాకుండానే ఆవేదనగా అన్నది కృష్ణవేణమ్మ.

"ఎందుకమ్మా బాధపడతారు? తప్పిపోయింది ఆడపిల్లగా. కట్నాల ఖర్చు కలిసొచ్చిందని సంతోషించండి" కోపంగా అన్నది మంజుల.

"ఇంతకీ నువ్వెవరో చెప్పలేదు? నా కూతురు భార్గవి నీకు తెలుసా? తెలిస్తే అదెక్కడుందో చెప్పు తల్లీ.."

"మీ భార్గవి ఎక్కడో లేదు. మీ ఎదురుగానే డాక్టర్ మంజులగా, పేదల పెన్నిధిగా పేరు తెచ్చుకుని ఇదుగో ఇక్కడే వుంది."

"మీరు.. నువ్వు మా భార్గవివా?" అపనమ్మకంగా ఆశ్చర్యంగా అన్నది కృష్ణవేణమ్మ.

"ఔనమ్మా నేనే. పదిహేనేళ్ల క్రితం గోదావరి పుష్కరాల్లో తప్పిపోయిన నీ కూతురు భార్గవిని. అనునిత్యం నీకు ఇంటిపనుల్లో సాయం చేస్తూ ఆడపిల్లగా పుట్టినందుకు నీచేత నిరసించబడుతూ పసితనంలోనే నీనుండి దూరమైన భార్గవిని. ఓ దేవత లాంటి స్త్రీమూర్తి రెక్కల కష్టంతో డాక్టరునై సమాజానికింత సేవచేసే భాగ్యం కలిగిన అదృష్టవంతురాల్ని."

కృష్ణవేణమ్మ భార్గవినే చూస్తోంది. ఆమె కళ్ల ముందు పరికిణీ, జాకెట్టు వేసుకొని ఇంటిపనులు చేసే భార్గవి రూపం కదిలింది. ఆ చిట్టిచేతులేనా నేడు స్టెతస్కోపుని పట్టుకున్నవి? ఆ చిన్నిచేతులేనా నేడు ఎందరికో ప్రాణదానం చేసే అభయ హస్తాలయినాయి? హైస్కూలు చదువు చెప్పించి పెళ్లి చేసెయ్యాలని అనుకున్న ఆ భార్గవేనా నేటి డాక్టర్ మంజుల? మంజులలో తన పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"ఏమ్మా నమ్మకం కలగడం లేదా? నేను నీ దగ్గరే పెరిగి వుంటే ఈపాటికి ఏ పదోక్లాసో చదివి పెళ్లిచేసుకొని పిల్లల్ని కని ఓ మామూలు గృహిణిగా మారి వుండేదాన్ని. ఇప్పుడు చెప్పమ్మా నన్ను నీ కూతురని చెప్పుకోడానికి నీకు గర్వంగా లేదూ? ఆడదానివై వుండి ఆడపిల్లల్ని కించపరిచేలా మాట్లాడకు. స్త్రీ తలచుకుంటే సాధ్యం కానిదేదీ లేదు.

ఆడపిల్ల అనగానే చిన్నతనం నుండీ ఆంక్షలూ, అర్థం లేని కట్టుబాట్లూ పెట్టి ఆమె ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయకండి. నువ్వు గుండెమీద చెయ్యి వేసుకొని చెప్పు. నీ దగ్గరే పెరిగుంటే నేను డాక్టర్ని అవగలిగేదాన్నా? నువ్వు నాకు జన్మనిస్తే నన్ను పెంచిన తల్లి నాకు జీవితాన్నిచ్చింది. ఆడపిల్లని తేలికచేసి మాట్లాడి వాళ్లమీద వాళ్లకే తేలికభావం కలిగించకండి" ఆవేశంగా అన్నది మంజుల.

"అమ్మా మంజులా నన్ను క్షమించు తల్లీ. ఇంత గొప్ప కూతుర్ని కన్న తరువాత కూడా ఆడపిల్ల వద్దని ఎలా అంటాను?" మంజుల తల నిమురుతూ అన్నది కృష్ణవేణమ్మ.

అత్తగారిలో వచ్చిన మార్పుకి, దేవత లాంటి ఆడపడుచు దొరికినందుకూ మనసులోనే దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకుంది సుజాత.

✪

